

**వరదపాలైన వడ్లు** | మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలకేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో భారీ వర్షానికి కొట్టుకుపోయిన వడ్లు



**చివరికి మిగిలిందిదే..** | పెద్దపల్లి జిల్లా మంథనిలో వరదనీటిలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

# వడ్లు వర్షార్పణం

- పలు జిల్లాల్లో ఈదురుగాలుల వానలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు
- విద్యుత్తు షాక్‌తో 3 బర్రెలు మృతి
- విరిగిన స్తంభాలు.. చీకట్లో పల్లెలు



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సిద్ధాపురం, మత్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద తడిసిన వడ్లును ఆరబోస్తున్న రైతులు, అటు కమ్ముతున్న మేఘాలు



జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాశీపల్లిలో ఈదురుగాలులతో శుక్రవారం కురిసిన వర్షానికి నేలవాలిన వరిపైరు



సిద్దిపేట మార్కెట్ యార్డులో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం రాశులను ముంచెత్తిన వరదనీరు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కురిసిన అకాల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వడ్లు భారీ వర్షంతో మళ్లీ తడిసిముద్దయ్యాయి. పలుచోట్ల వడ్ల గింజలు వరదలో కొట్టుకుపోయాయి. శుక్రవారం ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసింది. జనజీవనం స్తంభించిపోయింది. వాగులు, వంకలు ఉప్పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వడ్లు తడిసిముద్దయ్యాయి. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం, మహబూబాబాద్ మండలం గాంధీపురం, ముడుపుగల్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి మొలకెత్తింది. గార్ల మండలం రాంపూర్ చెక్‌డ్యాం నుంచి వరద పొంగిపొర్లడంతో మండలంలోని 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బయ్యారం మండలంలో పందిపంపుల, మసివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జంగాలపల్లి క్రాస్‌రోడ్డులో జంగాలపల్లి, ఇంచర్లకు చెందిన 30 మంది రైతుల మూడువేల క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయింది. గోవిందరావుపేట, వెంకటాపూర్, మంగపేట, ఏటూరునాగారం, ములుగు, వాజేడు, వెంకటాపురం (నూగూరు), కన్నాయిగూడెం మండలాల్లో ధాన్యం తడిసిపోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నీళ్లపాలైంది. ఆరబోసిన వడ్లు తడిసి మొలకెత్తుతున్నాయి. హనుమకొండ జిల్లాలో పలు మండలాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై ఆరబోసిన మక్కజొన్న, వడ్లు తడిసిముద్దయ్యాయి. వాటిని ఆరబెట్టుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొనుగోళ్లలో అధికారులు ఆలస్యం చేస్తుండటంతో ఈ దుస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు.



పెద్దపల్లి జిల్లా మంథని మండలం వెంకటాపూర్‌లో నేలకొరిగిన వరి పంట

### ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ..

కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన గాలివానకు కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. మంచిర్యాల జిల్లా కోటపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి భారీగా ధాన్యం రాగా, గురువారం రాత్రి కురిసిన వర్షానికి నీటిపాలైంది. వరదకు వడ్లు కొట్టుకుపోయాయి. భీమారంతోపాటు పలు గ్రామాల్లో వర్షానికి వడ్లు నీటిపాలయ్యాయి. కొన్నిచోట్ల వరి నేలకొరిగింది. దండేపల్లి మండలం కన్నేపల్లిలో అక్కల మల్లేశ్‌కు చెందిన బర్రె మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతంతో చనిపోయింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో వర్షానికి ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. పెంచికల్‌పేట్‌లో స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిపోయింది.

### తెగిపడిన ఎల్‌టీ లైన్ విద్యుత్తు తీగలు

**ఉమ్మడి** కరీంనగర్ జిల్లాలోని మంథని, రామగుండం, వేములవాడల్లో అకాల వర్షం ముంచెత్తింది. శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వాన రైతన్నకు కన్నీళ్లు మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. మంథని మండలం ఆరెంద, వెంకటాపూర్, మల్లారం గ్రామాల్లో వరిచేను నేలవాలింది. మామిడి కాయలు రాలిపోయాయి. ఖానాపూర్‌లో గాలి దుమారానికి వరిపొలాల్లో ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలు తెగిపడటంతో మేతకు వెళ్లిన అమ్మకుంటి సమ్మయ్యకు చెందిన రెండు బర్రెలు కరెంట్‌షాక్‌తో మరణించాయి. గోదావరిఖనిలో వర్షం దంచికొట్టడంతో జనజీవనం స్తంభించింది. వేములవాడలో 2.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. 24 గంటలు దాటినా పునరుద్ధరించకపోవడంతో కొదురుపాక, దేశాయిపల్లిలో అంధకారం నెలకొన్నది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో సైతం కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో శుక్రవారం సైతం కురిసిన వానకు వడ్లు తడిసిపోయాయి. సిద్దిపేట మార్కెట్ యార్డులో ధాన్యం తడిసి ముద్దయ్యింది. దుబ్బాక, తొగుట తదితర మండలాల్లోనూ వాన కురిసింది.



శుక్రవారం కామారెడ్డి జిల్లా బీబీపేట్ సొసైటీ వద్ద డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఇంద్రసేనారెడ్డిని నిలదీస్తున్న రైతులు



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం ముంగిమడుగు ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా అయినప్పటికీ సకాలంలో లోడ్ ఎత్తక మొలకెత్తిన బస్తాల్లోని ధాన్యం



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం రెడ్డిపురం రింగ్ రోడ్డుపై శుక్రవారం తడిసిన మక్కజొన్నను ఆరబోస్తున్న రైతులు



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం)లోని మార్కెట్ యార్డుకు తాళం వేసి ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు



మళ్లీ వరి వేయనని చెప్పుతో కొట్టుకుంటున్న రైతు సిద్ధయ్య

# ధాన్యం కొనాలని అన్నదాత ఆందోళన

- 500 బోనస్ ఇప్పుడే చెల్లించాలి
- తూకంవేసిన ధాన్యం తరలించాలి
- ఆత్మకూర్ సబ్ మార్కెట్ యార్డు గేటుకు తాళం వేసిన రైతులు
- గంటపాటు రోడ్డుపై రాస్తారోకో

నమస్తే తెలంగాణ, న్యూస్‌నెట్‌వర్క్, మే 17: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే.. 47 రోజులు కావొస్తున్నా ప్రభుత్వం కొనడం లేదని అన్నదాతలు మండిపడుతున్నారు. మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రాశులుగా పోసి అధికారులు ఎప్పుడు కాంటాలు వేసి కొంటారోనని రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. సర్కారు నిర్లక్ష్యం కారణంగా అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తుతున్నది. మరికొన్నిచోట్ల వరద నీటికి కొట్టుకుపోతున్నదని ఆగ్రహించిన అన్నదాతలు శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం)లోని సబ్ మార్కెట్ యార్డు ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. అనంతరం మోత్కూర్–భువనగిరి ప్రధాన రహదారిపై గంటపాటు రాస్తారోకో చేపట్టారు. కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి తడిసిందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, 500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్‌లో రైతులు ధర్నా చేశారు. గ్రామంలో సెంటర్ ఏర్పాటుచేసి 15 రోజులవుతున్నా కనీసం 50 మంది రైతుల ధాన్యాన్ని కొనలేదని మండిపడ్డారు. తూకం వేసిన బస్తాలు 15 రోజులైనా తరలించకపోవడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం అనుపురం రైతులు రోడ్డెక్కారు. వేములవాడ–కరీంనగర్ రహదారిపై బైఠాయించారు. మెదక్ జిల్లా రామాయంపేటలో మెదక్–సిద్దిపేట రోడ్డుపై రైతులు రాస్తారోకోకు దిగారు. ఎస్సీ కాలనీలోని సొసైటీ, పట్టణంలోని ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో మిగతా కొనుగోళ్లు సాగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంలో రైతులు ఆందోళనకు దిగారు.



మెదక్ జిల్లా రామాయంపేటలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

### మళ్లీ వరి వేస్తే చెప్పుతో కొట్టుకుంటా

నాకున్న రెండెకరాల్లో వరి సాగుచేసిన. ధాన్యాన్ని రంగంపేట పీఏసీఎస్ కేంద్రానికి తెచ్చి 20 రోజులు దాటింది. నిర్వాహకులు ధాన్యం తేమ శాతాన్ని చూడలేదు. తూకం వేయడానికి ఎన్ని రోజులు పడుతుందో చెప్పడం లేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మళ్లీ ధాన్యం తడిసింది. ధాన్యం ఆరబెట్టడానికి రోజు కేంద్రానికి వచ్చిపోవుడుకే సరిపోతున్నది. మళ్లోసారి నా పొలంలో వరి వేస్తే చెప్పుతో కొట్టుకుంటా. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంటే కేసీఆర్ సర్కారు నయముండే.

–చాకలి సిద్ధయ్య, రంగంపేట రైతు, చిలిపిచెడ్ మండలం, మెదక్ జిల్లా




మెదక్ జిల్లా దండుపల్లిలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రైతులు

# మెడలు వంచైనా 500 బోనస్ ఇప్పిస్తాం

- కాంగ్రెస్ సర్కారుపై బీఆర్‌ఎస్ ఫైర్
- దొడ్డు, తడిసిన వడ్లకూ బోనసివ్వాలి
- అన్నదాతలకు మద్దతుగా ధర్నాలు

డిచ్‌పల్లి/మనోహరాబాద్/తుర్కపల్లి, మే 17: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం.. సన్న, దొడ్డు, తడిసిన వడ్లు అనే తేడా లేకుండా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, ఆగస్టు 15వ తేదీ లోపల రుణమాఫీ చేయాలని, లేకుంటే.. సర్కారు మెడలు వంచైనా అన్నదాతలకు బోనస్ ఇప్పిస్తామని బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పలు చోట్ల ధర్నాలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లిలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసిన రైతులతో రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముచ్చటించారు. బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులు అరిగోస పడుతున్నారరని వంటేరు మండిపడ్డారు. పంటను కొనుగోలు కేంద్రాలకు తెస్తే కొనకపోవడంతో వర్షానికి తడిసి రైతులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.



బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లిలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్